సాక్షి
ఒడిశా
గురువారం । 20 । ఏప్రిల్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయంలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన హుండీ ఆదాయాన్ని ఆలయ పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,09,453లు, బంగారం 1.5 గ్రాములు, వెండి 65 గ్రాములు వచ్చాయని అధికారులు వెల్లడించారు.



కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం - 8లో



చిరకాల డిమాండ్‌కు మోక్షం - 8లో

న్యూస్‌రీల్

నగరంలో మోడలింగ్ విక్రయ కేంద్రం

• ప్రారంభించిన సీఎం నవీన్ పట్నాయక్



విక్రయశాలను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్

భువనేశ్వర్: నగరంలోని దుమ్‌దుమా ప్రాంతంలో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ మహిళల మోడల్ వెండింగ్ జోన్ బుధవారం ప్రారంభించారు. ఈ జోన్‌లో 42 దుకాణాలు ఉన్నాయి. అధునాతన సౌకర్యాలతో చక్కని పర్యావరణం వెండింగ్ జోన్ ప్రత్యేకతగా పేర్కొన్నారు. చక్కని కాంతి, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు ఏర్పాట్లు చేశారు. ఈ జోన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఉషాదేవి, మంత్రి అశోక్‌చంద్ర పండా, భువనేశ్వర్ నగర పాలక సంస్థ మేయర్ సులోచన దాస్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఖుర్దాలో బిజూ మహావీర్ జైపూర్ ఫుట్‌సెంటర్

భువనేశ్వర్: ఖుర్దా గుర్జాంగ్‌లో ప్రసిద్ధ జైపూర్ ఫుట్‌సెంటర్ 'బిజు మహాబీర్ జైపూర్ ఫుట్ సెంటర్'ను ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ బుధవారం ప్రారంభించారు. దీంతో రాష్ట్రంలోని దివ్యాంగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. జైపూర్ ఫుట్ కృత్రిమ కాలి అవయవాలు స్వయం-సమర్థంగా ఉండేలా దివ్యాంగులను ప్రోత్సహిస్తాయని సీఎం తెలిపారు. ఈ కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్రంలోని దివ్యాంగులందరికీ అతి త్వరలో కృత్రిమ అవయవాలను అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. దివ్యాంగులు సమాజంలో ముఖ్యమైన భాగమని, వారికి సరైన పునరావాసం కల్పించడం అందరి బాధ్యతగా పేర్కొన్నారు. దీనికోసం అంతా కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల సంక్షేమంతో మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వారికి పునరావాసంతో పాటు శిక్షణ ద్వారా సాధికారత కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వికలాంగులను ఆదుకునేందుకు అంతా సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా కృత్రిమ అవయవాలను అందించే సంచార వాహనాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారు

ఎస్‌ఐ సహా ముగ్గురు పోలీసులపై వేటు

• పోలీస్ స్టేషన్ నుంచి దొంగలు తప్పించుకోవడంతో చర్యలు

రాయగడ: సదర్ థానాలో విధులు నిర్వహిస్తున్న సబ్ ఇన్‌స్పెక్టర్ తోపాటు మరో ముగ్గురు పోలీసు సిబ్బందిపై జిల్లా ఎస్పీ వివేకానంద శర్మ వేటు వేశారు. విధి నిర్వాహనలో నిర్లక్ష్యం వహించడంపై సస్పెండ్ చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గత కొద్ది రోజులుగా రాయగడ పట్టణంలో బైక్ దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో దర్యాప్తు చేసిన పోలీసులు.. దర్యాప్తులో భాగంగా ఇద్దరు నిందితులను ఆంధ్రప్రదేశ్‌లో పట్టుకున్నారు. ఇరువురినీ సదర్ థానాకు తరలించగా, అక్కడి నుంచి తప్పించుకున్నారు. దీంతో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సబ్ ఇన్‌స్పెక్టర్ వికాష్ పటేల్, కానిస్టేబుల్ ప్రసాద్ హుయిక, ఓఏపీఎఫ్ కానిస్టేబుల్ దాశరథి కద్రక, హోంగార్డు ఎం.గౌరీశంకర్‌లను సస్పెండ్ చేశారు.

కటక్ పాసింజర్ పొడిగించాలని వినతి



ఎంపీ సాహుకు వినతిపత్రం అందిస్తున్న ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు

పర్లాకిమిడి: కటక్-పలాస పాసింజర్ రైలు(08533/08534) రోజూ రాత్రి 11 గంటలకు పలాస చేరుకుంటుంది. దీనిని పర్లాకిమిడి, గుణుపురం వరకు పొడిగించాలని స్థానిక ప్రెస్‌క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు బరంపురం ఎంపీ చంద్రశేఖర సాహును బుధవారం కలిసి, వినతిపత్రం అందించారు. రైలు సౌకర్యంతో అనేకమంది ప్రయాణికులు లబ్ధిపొందుతారని తెలియజేశారు. దీనిపై స్పందించిన ఎంపీ.. సమస్యను కేంద్ర రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ దృష్టికి తీసుకు వెళ్లి, పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

బంద్.. ప్రశాంతం

• హనుమాన్ జయంతి ర్యాలీపై ఇటీవల సంబల్‌పూర్‌లో దాడి
• చర్యను ఖండిస్తూ బంద్‌కు పిలుపునిచ్చిన వీహెచ్‌పీ, భజరంగ్ దళ్
• ఉద్దేశ పూర్వకంగా పండుగలను అడ్డుకుంటున్నారని ఆరోపణ
• ఎక్కడికక్కడే నిలిచిపోయిన ప్రయాణికుల రాకపోకలు



జయపురం: మీడియాతో మాట్లాడుతున్న బాబు భజరంగ్, గౌతమ్, గణేష్



జయపురం: దుకాణాలను మూసి వేయిస్తున్న వీహెచ్‌పీ శ్రేణులు



కొరాపుట్: దాబుగాంలో మెయిన్‌రోడ్డుపై బైఠాయించిన వీహెచ్‌పీ నాయకులు

జయపురం: సంబల్‌పూర్‌లో ఈనెల 12న జరిగిన అవాంఛనీయ ఘటన, హనుమాన్ జయంతి, మహాభిషు సంక్రాంతి సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. అయితే.. భక్తులపై పలువురు దాడికి దిగడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేగింది. దీనిని ఖండిస్తూ.. పశ్చిమ ఒడిశాలోని 14 జిల్లాల్లో విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) బుధవారం ఒక్కరోజు బంద్‌కు బుధవారం పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు, వ్యాపార వాణిజ్య సంస్థలు బజారులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. వీహెచ్‌పీ శ్రేణులు మోటారు బైక్‌పై పట్టణమంతా తిరిగి, అప్పటికే తెరిచి ఉన్న కొన్ని సంస్థలను మూసివేయించారు. బంద్ సందర్భంగా 26వ జాతీయ రహదారిలో అనేక వాహనాలు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ఒడిశా, కొరాపుట్ జిల్లాల నుంచి సరుకుల రవాణా చేయాల్సిన వాహనాలను రోడ్డు పైనే అడ్డుకోవడంతో అంతా అవస్థలకు గురయ్యారు. కార్యక్రమంలో బీజేడీ నాయకులు గౌతమ సామంతరాయ్, వీహెచ్‌పీ కొరాపుట్ జిల్లా పి.గణేష్ ఆచార్య కో-ఆర్డినేటర్ తదితరులు పాల్గొన్నారు.



జయపురం: బస్టాండ్‌లో నిలిచిపోయిన బస్సులు



కొరాపుట్: మైదల్‌పూర్‌లో మూతపడిన పెట్రోల్ బంక్



మల్కన్‌గిరి: మూసివేసిన దుకాణాలు

నవరంగ్‌పూర్ జిల్లాలో..

కొరాపుట్: హిందూమత అనుబంధ సంస్థలు ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన బంద్ నవరంగ్‌పూర్ జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా వీహెచ్‌పీ సేనలు బంద్ విజయవంతానికి కృషి చేసారు. ఉదయం 6 గంటల నుంచే ఎక్కడికక్కడ బస్సులు నిలిపివేసారు. సుదూరంగా ఉన్న రాయ్‌పూర్, భువనేశ్వర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన బస్సులు గమ్యం చేరుకోలేక నిలిచిపోయాయి. ముందస్తు ప్రచారంతో ప్రభుత్వ విద్యాసంస్థలు తెరువలేదు. సంఘీభావంగా స్థానికంగా ఉండే లారీలు, బస్సులు నడవలేదు. ఎక్కడికక్కడే కార్యకర్తలు రోడ్ల పై బైఠాయించి నిరసనలు తెలిపారు. నవరంగ్‌పూర్ జిల్లాలో డాబుగాం,పపడాహండి,మైదల్ పూర్ తదితర ప్రాంతాలలో బంద్ ప్రభావం గట్టిగా కనిపించింది.

రాయగడలో..

రాయగడ: భజరంగ్‌దళ్, విశ్వహిందు పరిషత్ నిర్వహించిన బంద్ విజయవంతమైంది. ఉదయం 6గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు మాత్రమే బంద్ పాటించారు. స్థానిక కపిలాస్ కూడలిలో వీహెచ్‌పీ, భజరంగదళ్ కార్యకర్తలు రోడ్డు మధ్యలో బైఠాయించి, నిరసన తెలియజేశారు. వ్యాపార, వాణిజ్య, విద్యాసంస్థలు బంద్ కారణంగా మూసివేసారు.

మల్కన్‌గిరిలో..

మల్కన్‌గిరి: జిల్లాలో విశ్వహింద్ పరిషత్, బజరంగ్ ధళ్ నాయకులు నిర్వహించిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. మల్కన్‌గిరిలో ప్రభుత్వ, ప్రైవేట్ బస్సులు పూర్తిగా స్టాండ్‌లోనే నిలిపివేశారు. సరుకుల దుకాణాలు మూసివేశారు. బంద్ కారణంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రయణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



మల్కన్‌గిరి: ఆందోళన చేస్తున్న భజరంగ్ దళ్ సభ్యులు



రాయగడ: కపిలాస్ కూడలిలో రోడ్డుపై బైఠాయించిన కార్యకర్తలు

ముఖ్యమంత్రి రాజీనామా చేయాలి

• 'వేదాంత' కుంభకోణంపై భారతీయ వికాస్ పరిషత్ డిమాండ్



లోయర్ పీఎంజీ ప్రాంతంలో ఆందోళన చేస్తున్న భారతీయ వికాస పరిషత్ సభ్యులు

భువనేశ్వర్: వేదాంత ఫౌండేషన్‌కు రాష్ట్రప్రభుత్వం అప్పనంగా అమూల్యమైన భూములను అక్రమంగా కేటాయించిందని, దీంతో పెద్ద సంఖ్యలో కుటుంబాలు, ప్రజలు ప్రభావితమయ్యారని భారతీయ వికాస పరిషత్ విమర్శించారు. ఈ కుంభకోణంలో ప్రైవేటు సంస్థకు భూముల కేటాయింపులో భాగంగా 2 ప్రముఖ నదులను ప్రభుత్వం అప్పగించిందన్నారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దాఖలైన కేసుల విచారణ చేపట్టిన రాష్ట్ర హైకోర్టు కేటాయింపులు అక్రమంగా నిర్ధారించి, రద్దు చేసిందని గుర్తుచేశారు. దీనికి నైతిక బాధ్యత వహించి ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. వేదాంత ఫౌండేషన్‌కు భూముల అక్రమ కేటాయింపులకు వ్యతిరేకంగా నగరంలోని మాస్టర్ క్యాంటీన్ చౌక్ లోయర్ పీఎంజీ ప్రాంతంలో బుధవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం స్థానిక క్యాపిటల్ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు దాఖలు చేసింది. భూముల అక్రమ కేటాయింపులో ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్, రాష్ట్ర రెవెన్యూశాఖ మాజీమంత్రి మన్మోహన్ సామల్, మాజీ విద్యాశాఖ మంత్రి సమీర్‌కుమార్ దే, మాజీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి బిజయకుమార్ పట్నాయక్, పూరీ జిల్లా మాజీ కలెక్టర్ రస్మిరంజన్ పట్నాయక్ ప్రముఖ సూత్రధారులు. వీరందరికీ వ్యతిరేకంగా పోలీసులు విచారణ చేపట్టి చట్టపరంగా సముచిత చర్యలు చేపట్టాలని బీవీపీ ప్రముఖుడు సురేంద్ర పాణిగ్రాహి కోరారు. ఆరోపణలు రుజువు కావడంతో నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

జయపురంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు


• నేటి నుంచి ఈనెల 23వరకు నిర్వాహణ



పోటీల వివరాలను తెలియజేస్తున్న నిర్వాహకులు

జయపురం: స్థానిక పట్టణంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు డీపీ అకాడమీ శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని అకాడమీ కార్యదర్శి దేవదత్త దాస్ బుధవారం వెల్లడించారు. జయపురం లోని ఆదర్శనగర్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో దీనికి సంబంధించిన వివరానలు ఆయన వెల్లడించారు. అవిభక్త కొరాపుట్‌లో బ్యాడ్మింటన్‌ను ప్రోత్సహించేందుకు డీపీ అకాడమీ కృషి చేస్తోందని తెలిపారు. పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ప్రకటించిన ఆయన.. ఈనెల 20న ప్రారంభమై, 23వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. పోటీల్లో డబుల్స్ విభాగంలో తల పడేందుకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 70 జట్లు పేర్లు నమోదు చేసుకున్నాయన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే ఆటగాళ్లందరికీ ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు స్పష్టంచేశారు. 3 కోర్టులలో పోటీలు నిర్వహించేందుకు నిర్ణయించామని, ఆటగాళ్లను 40 ఏళ్ల పైవారు(1983 ఏప్రిల్ 16కి ముందు జన్మించిన) ఫస్ట్ కేటగిరీ, 50 ఏళ్లు పైబడిన వారు(1974 ఏప్రిల్ 16కి మందు జన్మించిన) ద్వితీయ కేటగిరీ, 60 ఏళ్ల మధ్య వయస్సు పైబడిన సీనియర్లు తృతీయ గ్రూప్‌గా విభజించామన్నారు. అవిభక్త కొరాపుట్ ఆటగాళ్లకు 20, 21తేదీల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. విజేతలకు కేటగిరీ వారీగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, సెమీఫైనల్‌కు చేరిన ఆటగాళ్లకు రూ.5 వేలు చొప్పున బహుమతులు అందించనున్నట్లు వివరించారు. పోటీలను క్రీడాభిమానులు విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు దేవదత్త దాస్, సుబ్రత పండా, నిమయి దాస్, బును దాస్, మహేష్ దొర, గౌరీ పట్నాయక్, రాష్ట్రస్థాయి రిఫరీ అశిత్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

'మహా' వివాదంపై ట్రిబ్యునల్ క్షేత్రస్థాయి సర్వే



భువనేశ్వర్: మహానది జల వివాదాల ట్రిబ్యునల్ బుధవారం ఛత్తీస్‌గఢ్‌లో క్షేత్రస్థాయి సర్వేను ప్రారంభించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏఎం ఖాన్విల్కర్ నేతృత్వంలో త్రిసభ్య కమిటీ మహానది ఆవిర్భావం, సందూర్ ఆనకట్ట, రవిశంకర్ సాగర్, ఇతర ప్రధాన ఉపనదులతో సహా ఎగువ ప్రాంతాలను సందర్శించనున్నారు. 5 రోజులపాటు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించి, ఈ బృందం నివేదిక సిద్ధం చేస్తుంది. ఈ ప్రక్రియతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న జలాల వివాదం కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు. ఈ కమిటీ ఇరు రాష్ట్రాల్లో మహానది బేసిన్ లను, వర్షాకాలంలో రెండు రాష్ట్రాలకు నీటి లభ్యత, వినియోగాన్ని పరిశీలిస్తారు. మొదటి దశ సర్వే ఈనెల 22తో ముగుస్తుంది. ఈ దశలో ట్రిబ్యునల్ ఛత్తీస్‌గఢ్‌లోని నదీతీర ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేస్తుంది. రెండో విడత సర్వే ఈనెల 29నుంచి ప్రారంభమై, మే 3వరకు నిరవధికంగా కొనసాగుతుంది. హిరాకుడ్ ఆనకట్ట ఎగువ పరివాహక ప్రాంతంలో పరిస్థితిని సమీక్షించేందుకు ఈ బృందం మేలో కేలో డ్యామ్ ప్రాంతాన్ని సందర్శించే అవకాశం ఉంది. మహానదిపై ఆరు పారిశ్రామిక బ్యారేజీల నిర్మాణం, వానలు లేని సమయంలో దిగువ ప్రవాహం తక్కువగా ఉండటంపై ఒడిశా ప్రభుత్వం 2016లో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసింది. దీనిపై సమర్పించిన సాంకేతిక వాస్తవాల ఆధారంగా 2018 మార్చి 12న ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేశారు. సుప్రీంకోర్టు చొరవతో ఈ మేరకు చర్యలు చేపట్టారు. తక్కువ మొత్తంలో రుతుపవన వర్షపు నీటిని స్వల్పంగా సేకరించేందుకు, భూగర్భ జల వనరులను పెంపొందించే ఉద్దేశంతో మహానదిపై నిర్మించిన బ్యారేజీలు, ఆనకట్టలు నిర్మించినట్లు ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం తెలిపింది. నది నీటి ప్రవాహానికి ఏమాత్రం ఆటంకం కలిగించవని స్పష్టం చేసింది. అయితే పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉందని ఒడిశా సర్కార్ దీర్ఘకాలంగా ఉద్యమిస్తోంది.

అడవులు అంతరిస్తే మనుగడకే ముప్పు

• పశువైద్య శాఖ అధికారి డాక్టర్ చిన్మయ సాహు



మాట్లాడుతున్న డాక్టర్ చిన్మయ సాహు, వేదికపై చందన్ గమాంగో, పట్నాయక్

రాయగడ: పచ్చని చెట్లు, విలువైన ఔషధ వృక్షాలు, వన్యప్రాణులు నివసించే అడవులను అవగాహన లేకుండా తగలబెడుతున్నారని, ఇప్పటికైనా ప్రజలు చైతన్యవంతులవ్వకపోతే భవిష్యత్‌లో మానవ మనుగడకే ముప్పు ఏర్పడుతుందని కల్యాణ సింగుపూర్ సమితి పశువైద్య శాఖ అధికారి డాక్టర్ చిన్మయ సాహు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని కల్యాణ సింగుపూర్ సమితి మజ్జిగుడ వారపు సంతలో అటవీశాఖ అధికారులు మంగళవారం సాయంత్రం నిర్వహించిన అవగాహన శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాలకు చెందిన ప్రజలు అమాయకత్వంతో అడవులను తుగలబెతున్నారని, దీనివల్ల పర్యావరణానికి తీవ్రవిఘాతం ఏర్పడుతుందన్నారు. పర్యావరణం సమతుల్యానికి ఎంతగానో దోహదపడే చెట్లు అంతరిస్తుండటం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. అడువులు అంతరిస్తుండటంతో వన్యప్రాణులు జనావాసాల మధ్యకు వస్తున్నాయని, దీంతో వేటగాళ్ల బారినపడి ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఎదురవుతున్నాయన్నారు. ఇప్పటికైనా చైతన్యం రాకపోతే పర్యావరణ పరంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. కల్యాణ సింగుపూర్ అటవీశాఖ రేంజర్ చందన్ గమాంగో మాట్లాడుతూ పర్యావరణంలో మార్పులు ఇప్పటికే అంతా చూస్తున్నామని గుర్తుచేశారు. సకాలంలో వర్షాలు కురవక రైతులు నానా అవస్థలు పడుతున్నారని, వీటంతటికి కారణం చెట్లు, పచ్చని అడవులను నాశనం చేయడమేనని స్పష్టంచేశారు. ఏటా వేసవిలో అడవులు కార్చిచ్చుకు గురవుతున్నాయన్నారు. అలాగే మజ్జిగుడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీధర్ పట్నాయక్ ప్రసంగించారు. అంతకుముందు అడవులకు నిప్పంటించడం వల్ల ఎదురయ్యే అనర్థాలకు సంబంధించి మాక్‌డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అటవీశాఖ సిబ్బంది, గ్రామస్తులు

క్లుప్తంగా

డీఈఓగా తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా విద్యాశాఖాధికారిగా వమ్మరవల్లి డైట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు వెలువరించింది. శ్రీకాకుళం ఉప విద్యాశాఖాధికారిగా కూడా సేవలు అందిస్తున్న తిరుమల చైతన్యను పూర్తి అదనపు బాధ్యతలతో డీఈఓగా నియమించింది. ఈయన ఇదివరకే జిల్లా డీఈఓగా, సమగ్రశిక్ష అభియాన్ పీఓగా పనిచేసిన విషయం విదితమే. ఇప్పటి వరకు డీఈఓగా వ్యవహరించిన గార పగడాలమ్మను టెక్కలి ఉప విద్యాశాఖాధికారిగా నియమించారు. పగడాలమ్మ నుంచి తిరుమల చైతన్య బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది.

21న జాబ్‌మేళా

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.ఎస్.శ్రీనివాసరావు బుధవారం చెప్పారు. కడపకు చెందిన షిర్డీసాయి ఎలక్ట్రానిక్స్ సంస్థ నిర్వహించే ఈ ఇంటర్వ్యూలకు ఫిట్టర్, ఎలక్ట్రికల్ ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులు అర్హులని పేర్కొన్నారు. ప్రారంభంలో నెలకు రూ.12 వేలు వేతనం, భోజన, వసతులు సంస్థ కల్పిస్తుందని చెప్పారు. ఉదయం 10 గంటలకు విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని, పూర్తి వివరాలకు 98499 88879 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టెన్త్ స్పాట్ ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియ (స్పాట్ వాల్యుయేషన్) బుధవారం ప్రారంభమైంది. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతోపాటు సమీపంలోని మహాలక్ష్మినగర్ కాలనీలో ఉన్న శ్రీచైతన్య స్కూల్‌లో మూల్యాంకనం జరుగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజుల్లో మూల్యాంకనం పూర్తిచేసేలా అధికారులు చర్యలు చేపట్టారు. బాలికోన్నత పాఠశాల కేంద్రంలో తెలుగు, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లు దిద్దుతున్నారు. శ్రీచైతన్య స్కూల్ కేంద్రంలో గణితం, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, హిందీ పేపర్లను దిద్దుబాటు చేస్తున్నారు. డీఈఓ గార పగడాలమ్మ నేతృత్వంలో అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్, డిప్యూటీ క్యాంప్ ఆఫీసర్లు డాక్టర్ తిరుమల చైతన్య, ఆర్.విజయకుమారి, ఏసీఓలు పర్యవేక్షిస్తున్నారు. మూల్యాంకనంలో ఎలాంటి తప్పులకు, అక్రమాలకు తావు లేకుండా పక్కాగా, పారదర్శకంగా వ్యవహరించాలని డీఈఓ పగడాలమ్మ అసిస్టెంట్ ఎగ్జామినర్లకు, సిబ్బందికి సూచించారు.

కణితి కుటుంబానికి పరామర్శ



కణితి విశ్వనాథం చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సోము వీర్రాజు

కాశీబుగ్గ: మాజీ ఎంపీ డాక్టర్ కణితి విశ్వనాథం ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు బుధవారం పరామర్శించారు. కుమార్తె డాక్టర్ శారద, కుమారుడు రాజేంద్రలను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు కొర్ల కన్నారావు, కొర్రాయి బాలకృష్ణ యాదవ్, పాలవలస వైకుంఠరావు, స్వామి రామానంద, వైశ్యరాజు మోహనరాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై బ్లేడ్‌తో దాడి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఏఎస్‌పేట వద్ద ఎం.తోటూరుకు చెందిన బోరుబద్ర వెంకటరావుపై ఏఎస్‌పేటకు చెందిన ఉదయపురం మహేష్ అనే వ్యక్తి బ్లేడ్‌తో దాడిచేసి గాయపర్చాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటరావు, అతని స్నేహితులు కలిసి ద్విచక్రవాహనంపై సుమండి రోడ్డు నుంచి ఇచ్ఛాపురం వైపు వస్తుండగా ఏఎస్‌పేట వద్దకు వచ్చేసరికి రోడ్డుపైన కొంత మంది వ్యక్తుల గొడవపడటంతో బైకులు ఆపారు. ఎందుకు గొడవ పడుతున్నారని ప్రశ్నించగా ఏఎస్‌పేటకు చెందిన మహేష్‌తో పాటు నర్తు మేఘనాథం, నర్తు చిరంజీవులు, దట్టి భగీరథి, మరోవ్యక్తి కలిసి వెంకటరావు, అతని స్నేహితులపై దాడికి దిగారు. మహేష్ బ్లేడ్‌తో దాడి చేయడంతో వెంకటరావు ముఖానికి తీవ్ర గాయమైంది. బాధితుడ్ని వెంటనే స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. వెంకటరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ కె.గోవిందరావు కేసు నమోదుచేశారు.

యువకుడు ఆత్మహత్య

మెళియాపుట్టి: మండలంలోని కొసమాల గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొసమాలకు చెందిన వరిసి ఆనందరావు, కృష్ణవేణి భార్యాభర్తలు. వీరికి ఇద్దరు కుమారులు వరిసి జ్యోతేశ్వరరావు, వినోద్ (27). కృష్ణవేణి తల్లి హైదరాబాద్‌లో మృతిచెందడంతో ఆమెను కడసారి చూసేందుకు ఆనందరావు దంపతులు సోమవారం అక్కడికి వెళ్లారు. ఇంతలో ఏం జరిగిందో గానీ వినోద్ బుధవారం వేకువజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. ఉదయం ఏడు గంటల సమయంలో సోదరుడు గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. కుటుంబ కలహాల నేపథ్యంలోనే మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. మృతుడి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అందొచ్చిన కొడుకు మృతి చెందాడన్న సమాచారం తెలుసుకుని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

కాంగ్రెస్‌కు పూర్వవైభవం ఖాయం



వేదికపై ఎంపీ సప్తగిరి ఉలక, మాజీమంత్రి డొంబురుధర, బిజయ్‌కుమార్ పట్నాయక్

- సీనియర్ నాయకుడు బిజయ్‌కుమార్ పట్నాయక్
- విజయమే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలకు పిలుపు

రాయగడ: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం రావడం ఖాయమని పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర సచివాలయ మాజీ ముఖ్య కార్యదర్శి బిజయ కుమార్ పట్నాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని లయన్స్ క్లబ్‌లో డీసీసీ అధ్యక్షుడు దుర్గా పండా అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించాలంటే అంతా కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి కార్యకర్త నుంచి ప్రతి నాయకుడు సైనికుల్లా పనిచేయాల్సి ఉంటుందన్నారు. అధికారంలో ఉన్న బీజేడీ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగెత్తారని, మార్పును కోరుకుంటున్నారని తెలిపారు. దీనిని సద్వినియోగించుకుని, ఇప్పటి నుంచే ప్రతి జిల్లాలో ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లాలని వివరించారు.

విబేధాలకు తావులేదు..

పార్టీ అభివృద్ధి చెంది, రాష్ట్రంలో అధికార జెండా ఎగుర వేయాలంటే.. అంతా అంతర్గత విబేధాలకు స్వస్తి పలకాలను హితవు పలికారు. రాష్ట్రంలో 2దశాబ్దాలకు పైగా అధికారం కోల్పోయిన ఉన్న పరిస్థితుల్లో ఐకమత్యం అత్యంత కీలకమన్నారు. ఒకే తాటిపై నడిస్తేనే పార్టీకి పూర్వవైభవం తిరిగి వస్తుందని అభిప్రాయం వ్యక్తంచేశారు. ప్రధానంగా బీజేడీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రధాన అస్త్రాలుగా వినియోగించాలని సూచించారు. హస్తాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నామని తెలియజేశారు. ప్రతి జిల్లాలో ఈ తరహా కార్యకర్తల సమావేశాలను నిర్వహిస్తూ.. వారిలో మనోభావాలను తెలుసుకుంటున్నామన్నారు. అంతా సమైక్యతగా పనిచేస్తే విజయం నల్లేరుపై నడక వంటిదని తెలిపారు.

మార్పులు అవసరం..

కాంగ్రెస్ పార్టీ తిరిగి రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టాలంటే అందుకు సీనియర్ నాయకులు దిక్సూచిగా వ్యవహరించి, కార్యకర్తలకు దిశానిర్దేశం చేయాల్సిన ఆవశ్యకత ఉందని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలక అన్నారు. దీనికి సరైన నాయకత్వం అవసరమని హితవుపలికారు. పార్టీలో ఎంతోమంది సీనియర్ నాయకులు ఉన్నారని, అటువంటి వారిని సంప్రదించి.. వారి అనుభవాలు, అవసరమైన సూచనలు తీసుకోవాలని తెలిపారు. వయస్సు రీత్యా సహకరించక పోయినప్పటికీ వారి మార్గాలను అనుసరించే విధంగా నాయకులు కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే యువతకు కూడా సరైన ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. జిల్లాలోని 3శాసనసభ సీట్లతో పాటు మరోసారి కొరాపుట్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగుర వేసేందుకు అంతా నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాం..

కొరాపుట్ లోక్‌సభ స్థానంలోని అన్ని ప్రాంతాల సమస్యలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లామని ఈ సందర్భంగా ఎంపీ సప్తగిరి వివరించారు. ప్రధానంగా గ్రామాల్లో సెల్‌ఫోన్ నెట్‌వర్క్ వంటి సమస్యల పరిష్కారంలో ఎంతో సఫలీకృతం అయ్యామన్నారు. ప్రజలకు అవసరమయ్యే మౌలిక సమస్యలపై పలుమార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు గుర్తుచేశారు. పార్టీపై అభిమానం కలిగిన ప్రజలు ఈసారి కొరాపుట్ లోక్‌సభ స్థానంతో పాటు గుణుపూర్, రాయగడ, బిసంకటక్ శాసనసభ స్థానాల్లో కాంగ్రెస్‌కు పట్టంగడతారని విశ్వాసం వ్యక్తంచేశారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా కమిటీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ పండా మాట్లాడుతూ ఈ ప్రాంత సమస్యలపై నిరంతరం పోరాడుతున్నామన్నారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లడంలో ఎంతో కృషి చేస్తున్నామని తెలిపారు. సమావేశంలో మాజీమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డొంబురు ధర ఉలక, అప్పలస్వామి కద్రక, వివిధ సమితుల అధ్యక్షులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

స్కూల్ ఆటో బోల్తా



కొత్తూరు సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారులు

- ఐదుగురు చిన్నారులకు గాయాలు
- రిమ్స్‌కు ఇద్దరు తరలింపు
- మెట్టూరు వద్ద ఘటన

కొత్తూరు: పాఠశాల నుంచి విద్యార్థులతో ఇంటికి వస్తున్న ఆటోను మరో ఆటో ఢీకొన్న ఘటనలో ఐదుగురు చిన్నారులు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తూరు మండలం ఓండ్రుజోల గ్రామానికి చెందిన విద్యార్థులు పారాపురంలోని ఇమ్మానియల్ ప్రైవేటు స్కూల్, మెట్టూరు హైస్కూల్లో చదువుతున్నారు. వీరిని ఆటోడ్రైవర్ జి.రాజారావు రోజూ తన ఆటోలో స్కూల్‌కు తీసుకెళ్తుండేవాడు. ఎప్పట్లాగే బుధవారం కూడా పాఠశాలల నుంచి ఇళ్లకు తిరిగి వెళ్తుండగా మెట్టూరు వద్ద అలికాం-బత్తిలి రోడ్డులో మరో ఆటో వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆటో బోల్తాపడటంతో ఇమ్మానియల్ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న శనాపతి ప్రశాంత్, గొర్లె మిథిన్, మెట్టూరు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కురిగి త్రివేణి, పొన్నాన షర్మిల, నవీన్‌లు గాయపడ్డారు. డ్రైవర్, మరో ఇద్దరు విద్యార్థులు ఎటువంటి గాయాలు లేకుండా బయట పడ్డారు. తీవ్రంగా గాయపడిన మిథిన్, నవీన్‌లను మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు. మిగిలిన చిన్నారులను 108లో కొత్తూరు సీహెచ్‌సీకి తరలించారు. సూపరింటెండెంట్ డి.కిషోర్, వైద్యాధికారి రామకృష్ణ వైద్యసేవలు అందించారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి చేరుకుని పిల్లల పరిస్థితిని చూసి బోరున విలపించారు. మద్యం షాపు రోడ్డువైపు నుంచి వచ్చిన ఓ ఆటో తమను ఢీకొట్టినట్లు డ్రైవర్ జి.రాజారావు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ బి.సింహాచలంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సురేష్ తెలిపారు.



తీవ్రంగా గాయపడిన ఒకటో తరగతి విద్యార్థి మిథిన్



ప్రమాదానికి గురైన ఆటో ఇదే



విద్యార్థిని ఆస్పత్రిలో చేర్పిస్తున్న దృశ్యం

'ఎలక్ట్రికల్' షాక్!



కాలిపోయిన గోడలను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం



కాలిబూడిదైన ఎలక్ట్రికల్ బైకులు



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని 14వ వార్డు భగవతీ థియేటర్ ఎదురుగా మూడు దుకాణాలు బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమయ్యాయి. పెయింట్ షోరూంలో మంటలు చెలరేగి పక్కనే ఉన్న ఎలక్ట్రికల్ బైకుల షోరూంకు అంటుకోవడంతో 90 బైకులు, మూడు ఆటోలు కాలిబూడిదయ్యాయి. పక్కనే ఉన్న ప్రభుత్వ వైన్‌షాప్‌కు సైతం మంటలు అంటుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది మూడు గంటల పాటు శ్రమించి మంటలు ఆర్పాయి. – పలాస

రైలు ఢీకొని మహిళ మృతి

పొందూరు: పొందూరు-దూసి రైల్వే స్టేషన్ల మధ్య గోరింట గ్రామ సమీపంలో విశాఖ-పలాస ప్యాసింజర్ రైలు కిందపడి బుధవారం గుర్తు తెలియని మహిళ మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. మృతురాలి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుందని, శరీరం నుజ్జయిపోవడంతో గుర్తుపట్టలేని విధంగా మారిందని చెప్పారు. కుంకుమ రంగు చీర ధరించి, సగం జుట్టుతో ఉన్నట్లు తెలిపారు. వివరాలు తెలిసిన వారు 70132 73731 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

సీనియర్ సివిల్ జడ్జిలు బదిలీ

గుంటూరు లీగల్: రాష్ట్ర వ్యాప్తంగా 40 మంది సీనియర్ సివిల్ జడ్జీలను బదిలీ చేస్తూ ఏపీ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) సునీత బుధవారం ఉత్తర్వులిచ్చారు. శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.నాగమణిని విజయనగరం డీఎల్ఎస్ఏ సెక్రటరీగా, విజయనగరం సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావును సోంపేట సీనియర్ సివిల్ జడ్జిగా, టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరితను గూటీ సీనియర్ సివిల్ జడ్జిగా నియమించారు. మే 2వ తేదీలోపు న్యాయమూర్తులు విధుల్లో చేరాలని పేర్కొన్నారు.

గురుకుల పాఠశాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు

మెళియాపుట్టి: ఇటీవల మండలంలోని పెద్దమడి గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, మరో ఐదుగురు ఉపాధ్యాయులకు ఐటీడీఏ పీఓ షోకాజ్ నోటీసు జారీ చేశారు.

చిరకాల డిమాండ్‌కు మోక్షం



వంతెన ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తారాప్రసాద్

- బొరిగుమ్మలో వంతెన ప్రారంభించిన ఎమ్మెల్యే తారాప్రసాద్

జయపురం: సబ్ డివిజన్ లోని బొరిగుమ్మ ప్రజలు ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న వంతెన నిర్మాణం పూర్తయి, ప్రజల చిరకాల వాంఛ తీరిందని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. బొరిగుమ్మ సమితి పాతబొరిగుమ్మ ప్రాంతంలో రూ.4 కోట్ల 88 లక్షల వ్యయంతో నిర్మించిన వంతెనను ఆయన మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ వంతెన కోసం ఎంతోకాలంగా బొరిగుమ్మ సమితిలోని 15పంచాయతీల ప్రజలు ఎదురు చూస్తున్నారని, వారు కోరిక ఇప్పుడు నేరవేరిందని తెలిపారు. దీని ద్వారా ఆయా పంచాయతీలను కలుపుతూ రహదారి సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే నిత్యం వేలాదిమంది ప్రజలు, విద్యార్థులు బొరిగుమ్మలోని విద్యాలయాలు, కళాశాలలు, సమితి కార్యాలయం, ఆస్పత్రి, బ్యాంక్, కోర్టు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సులభంగా చేరుకోవచ్చని సూచించారు. అనువైన మార్గాలు ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని అభిప్రాయం వ్యక్తం చేసారు. వంతెన కోసం తాను ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని వివరించారు. కార్యక్రమంలో బొరిగుమ్మ సమితి ఇంజినీర్లు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

గ్రామాల ప్రగతికి కృషి చేయాలి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు సేవా దృక్పథం అలవరుచుకోవాలని, గ్రామీణ ప్రాంత ప్రగతికి కృషి చేయాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల యూనిట్-7 విద్యార్థులు ఈ నెల 26 వరకు నిర్వహించనున్న జాతీయ సేవా ప్రత్యేక శిబిరాన్ని ఎచ్చెర్లలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సర్వేలు గ్రామాల ప్రగతికి దోహదపడతాయన్నారు. విద్యాహక్కు చట్టం, బాలకార్మిక వ్యవస్థపై చైతన్యం, పారిశుద్ధ్యం, పచ్చదనం- పరిశుభ్రత వంటి కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అడ్డయ్య, జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ ఎం.అనూరాధ, ప్రోగ్రాం అధికారి తొత్తడి భవాని, వై.మౌళీశ్వరరావు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ వెంకటరావు

వైద్యవృత్తిని అంకితభావంతో చేపట్టాలి



వైద్య విద్యార్థులు, ఆస్పత్రి ప్రతినిధులతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

- డాక్టర్ కావడం నోబెల్‌తో సమానం
- జెమ్స్ విద్యార్థుల పట్టాల ప్రదానోత్సవంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం/శ్రీకాకుళం కల్చరల్: డాక్టర్ కావడమనేది ప్రఖ్యాత నోబెల్ బహుమతి పొందడంతో సమానమని, ఎంతో గొప్పదైన వైద్య వృత్తిని అంకితభావంతో చేపట్టాలని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బుధవారం 2017-23 బ్యాచ్ వైద్య విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగి పుస్తకంతో సమానమని, ప్రతి పేషెంట్ వైద్యునికి ఎంతో జ్ఞానాన్ని అందిస్తారని, ఆ దృష్టితోనే వైద్య సేవలందించాలన్నారు. అవసరం మేరకే మందులు రాయాలని కోరారు. విదేశాలకు వెళ్లి జ్ఞానాన్ని పెంచుకొని తిరిగి మన దేశానికే సేవ చేయాలన్నారు. వ్యాధి వచ్చాక చికిత్స అందించడం కన్నా రోగాల బారిన పడకుండా ప్రజలను చైతన్యపరచాలన్నారు.యువత రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థలను బాగుచేయాలే తప్ప అవినీతి రాజకీయాల్లో భాగస్వామ్యం కాకూడదన్నారు. జెమ్స్‌లో అందిస్తున్న సేవలు గొప్పవని కొనియాడారు. సీఎండీ, కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ చైర్మన్ బొల్లినేని భాస్కరరావు మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాల వైపు తీసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో జెమ్స్ వైద్యులు డాక్టర్ సుధీర్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మిలలిత, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సీఈఓ బొల్లినేని ఆద్విక్, సీఏఓ స్వర్ణ, రామ్మోహన్, కిమ్స్ వైద్యులు గూడేన సోమేశ్వరరావు, ఆర్ఎంఓ ప్రవీణ్‌కుమార్, బాలమురళీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం డేఅండ్‌నైట్ జంక్షన్‌లో ఎన్‌జీ రంగా, సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహాలకు మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంతకుముందు శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన నివాసంలో తేనీటి విందు ఏర్పాటు చేశారు. శిష్ట కరణాలను ఓబీసీల్లో చేర్పించేందుకు కృషి చేయాలని సంఘ నాయకులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, శ్రీనివాస పట్నాయక్ వినతిపత్రం సమర్పించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాంతాకల్యాణ అనురాగ నిలయాన్ని వెంకయ్యనాయుడు సందర్శించారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు సేవా కార్యక్రమాలను వివరించారు.

శభాష్ పోలీస్!

- రైల్వేట్రాక్‌పై వ్యక్తి ఆత్మహత్యాయత్నం
- కాపాడి కౌన్సిలింగ్ ఇప్పించిన ఎస్‌ఐ



రవికుమార్‌తో మాట్లాడుతున్న ఎస్‌ఐ బాలరాజు

సోంపేట : ఎస్‌ఐ సమయస్ఫూర్తి ఓ ప్రాణాన్ని రక్షించింది. ఆత్మహత్యకు ప్రయత్నించిన వ్యక్తిని సోంపేట ఎస్‌ఐ ఎస్.బాలరాజు కాపాడి ఆదర్శంగా నిలిచారు. మూలపేటలో బుధవారం సీఎం బందోబస్తు ముగించుకుని ఎస్‌ఐ బాలరాజు తిరిగి వస్తుండగా సోంపేట ఫ్లైఓవర్ క్రింద రైల్వే ట్రాక్‌పై ఎవరో వ్యక్తి పడుకున్నట్లు గమనించారు. వెంటనే జీపు ఆపి వ్యక్తిని కాపాడి బయటకు లాగారు. కాసేపు మాట్లాడి ఆత్మహత్య చేసుకోవడానికి గల కారాణాలు అడిగి తెలుసుకున్నారు. తన పేరు సీహెచ్ రవికుమార్ అని, పలాసలో ఉంటున్నట్లు చెప్పాడు. కుటుంబ కలహాల వల్ల ఆత్మహత్య చేసుకుంటున్నట్లు తెలియజేయగా ఎస్‌ఐ తన స్నేహితుడు జగదీశ్‌ను పిలిపించి కౌన్సిలింగ్ ఇప్పించారు. చనిపోతే కుటుంబానికి కలిగే నష్టాలు వివరించి రవికుమార్‌ను తిరిగి పలాస పంపించారు. రవికుమార్ ప్రాణాన్ని కాపాడిన ఎస్‌ఐను స్నేహితులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

పీజీ రెండో సెమిస్టర్ ఫలితాలు వెల్లడి

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలకు సంబంధించి పోస్టు గ్రాడ్యుయేషన్ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ బుధవారం చెప్పారు. ఫలితాలు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. మార్కుల జాబితాలు కళాశాలలకు అందజేస్తామని, రీ వాల్యుయేషన్ కోరుకునే విద్యార్థులు 15 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్పెషల్ బీఎడ్ మెంటల్లీ రిటార్డ్‌లో 28 మందికి 28 మంది, జర్నలిజంలో ముగ్గురు, మూడేళ్ల లా కోర్సులో 108 మందికి 97 మంది, ఎకనామిక్స్‌లో ఐదుగురు, రూరల్ డెవలప్‌మెంట్‌లో ఇద్దరికి ఇద్దరు, సోషల్ వర్కులో ఆరుగురు, తెలుగులో ఏడుగురు, ఎంబీఏలో 46 మంది, ఎంకాంలో 23 మంది, ఎంఈడీలో 28 మంది, ఎంఎల్ఐఎస్సీలో తొమ్మిది మందికి 9 మంది, ఐదేళ్ల లా కోర్సులో 20 మందికి 18 మంది, డీపీఈలో 27 మందికి 26 మంది, ఎంహెచ్ఏలో 44 మందికి 35 మంది, ఎంసీఏలో 46 మందికి 32 మంది, ఎనలాటికల్ కెమిస్ట్రీలో 53 మందికి 50 మంది, బయోటెక్నాలజీలో 29 మందికి 27 మంది, ఫిజిక్స్‌లో 22 మందికి 19 మంది, ఆర్గానిక్ కెమిస్ట్రీలో 143 మందికి 119 మంది, గణితంలో 20 మందికి 18 మంది, యోగాలో 14 మందికి 13 మంది, జువాలజీలో ఏడుగురికి ఏడుగురు, మైక్రో బయోలజీలో 19 మంది, కంప్యూటర్ సైన్స్‌లో 11 మందికి 9 మంది, అప్లెడ్ మ్యాథ్స్‌లో నలుగురికి ముగ్గురు ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు.

క్లుప్తంగా

ఇటుక బట్టీలకు అనుమతులు తప్పనిసరి

విజయనగరం ఫూల్‌బాగ్‌: ఇటుక బట్టీలకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలని మైన్స్‌ ఎ.డి ఎస్పీకె మల్లేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటుక బట్టీలకు సంబంధించి తమ సిబ్బంది బొబ్బిలి, రామభద్రపురం మండలాల్లో బుధవారం తనిఖీ నిర్వహించి 4 కేసులు నమోదు చేసి రూ.4,400 అపరాధరుసుము విధించినట్లు పేర్కొన్నారు. అనుమతులు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాధితుడికి ఫోన్‌ అందజేసిన ఆర్టీసీ అధికారులు



బాధితుడికి ఐఫోన్‌ అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

విజయనగరం టౌన్‌: ఒడిశా ప్రయాణికుడు దేవ్‌ అనే వ్యక్తి విజయనగరం కాంప్లెక్స్‌లో ఐఫోన్‌ మరిచిపోయి, బస్సు ఎక్కి వెళ్లిపోయాడు. ఆన్‌ డ్యూటీలో ఉన్న పోలీస్‌ ఆ ఫోన్‌ను గుర్తించి విచారణ చేశారు. ఈ మేరకు ఆర్టీసీ కంట్రోల్‌ రామరాజు బాధితుడి వివరాలు కనుక్కొని ట్రాఫిక్‌ కంట్రోలర్‌ ఆదినారాయణ, ఎస్‌టీఐ దుర్యోధన చేతుల మీదుగా బాధితుడికి ఫోన్‌ అందజేశారు. రూ.70వేల విలువైన ఐఫోన్‌ తిరిగి భద్రంగా ఇచ్చిన ఆర్టీసీ అధికారులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపాడు.

8 తులాల బంగారం చోరీ

శృంగవరపుకోట: పట్టణంలో పుణ్యగిరి రోడ్డులో రైల్వేగేటు సమీపంలో నివాసం ఉంటున్న కాపు వెంకటస్వామి ఇంట్లో బంగారం చోరీకి గురైనట్లు ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు. వెంకటస్వామి తన తల్లి సన్యాసమ్మతో పాటు నివాసం ఉంటున్నాడు. సోమవారం సాయంత్రం 6గంటల సమయంలో బీరువా ముందు చెవి దుద్దు పడి ఉండడం చూసిన సన్యాసమ్మ రాత్రి ఇంటికి వచ్చిన కొడుక్కి చెప్పడంతో బీరువా తెరిచి చూసేసరికి అందులో ఉండాల్సిన బంగారం కనిపించలేదు. దీంతో బాధితుడు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు పోయిన బంగారం 8తులాలు ఉంటుందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

50 కిలోల గంజాయి స్వాధీనం

శృంగవరపుకోట: అరకు నుంచి అక్రమంగా వాహనంలో తరలిస్తున్న గంజాయిని ఎస్‌.కోట పోలీసులు బుధవారం ఉదయం పట్టుకున్నారు. బొడ్డవర జంక్షన్‌లో వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు ఓ కారులో సుమారు 25ప్యాకెట్లు గంజాయిని గుర్తించారు. ఒడిశాలోని మల్కన్‌గిరి ప్రాంతానికి చెందిన వ్యక్తిని, గంజాయి తరలిస్తున్న కారును అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన గంజాయి 50కిలోలు ఉందని నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తారకేశ్వరరావు చెప్పారు.

పుస్తెల తాడు అపహరణ



దర్యాప్తు చేస్తున్న సీఐ ప్రసాద్‌ తదితరులు

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో మంగళవారం రాత్రి గ్రామానికి చెందిన పడిమి సింహాచలమమ్మ బంగారం పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు ఎస్సై ఎం.రాజేష్‌ బుధవారం తెలిపారు. మేడ మీదనుంచి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిలో చొరబడి నిద్రిస్తున్న తన మెడలో ఉన్న సుమారు రెండు తులాల పుస్తెల తాడు అపహరించినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి సీఐ సీహెచ్‌ ప్రసాద్‌లో కలిసి వెళ్లి పరిశీలించి కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై రాజేష్‌ వివరించారు.

గిరిజన సంక్షేమానికి పెద్దపీట

సాలూరు: గిరిజన సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని సంపంగిపాడు గిరిశిఖర పంచాయతీలో ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పాలనను వివరించారు. గిరిజనుల వినతిమేరకు ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ పట్టాలు మంజూరుచేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. సంపంగిపాడు, డెన్సరాయి గ్రామాలకు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.32కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్టు తెలిపారు. కురుకూటి వద్ద రూ.9 కోట్ల వ్యయంతో వంతెన నిర్మించనున్నామని, దీని వల్ల 30 గ్రామాల ప్రజల రాకపోకల కష్టాలు తొలగుతాయన్నారు. ఆరేళ్లపాటు ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి, మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా చేసిన భంజ్‌దేవ్‌లు గిరిజన అభివృద్ధికి ఏమిచేశారో చెప్పాలన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. ఎవరి హయాంలో నియోజకవర్గ అభివృద్ధి జరిగిందో గుర్తించాలన్నారు. అభివృద్ధిపై చర్చకు ఎవరువచ్చినా సిద్ధమని సవాల్‌ విసిరారు. కార్యక్రమంలో వైస్‌ ఎంపీపీ రెడ్డి సురేష్‌, ఏఎంసీ చైర్‌పర్సన్‌ దండి అనంతకుమారి, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల్లో హత్య కేసు ఛేదన

- గొంతు కోసి ప్రాణం తీసిన నిందితులు
- రిమాండ్‌కు నలుగురి తరలింపు
- వివరాలు వెల్లడించిన ఇన్చార్జ్‌ డీఎస్పీ



హత్యకేసు వివరాలను వెల్లడిస్తున్న విజయనగరం ఇన్‌చార్జ్‌ డీఎస్పీ ఆర్‌.శ్రీనివాసరావు, పక్కన సీఐ సీహెచ్‌.లక్ష్మణరావు, ఎస్సై షేక్‌ శంకర్‌ (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్‌: సంచలనం రేకెత్తించిన అలీజాన్‌ మర్డర్‌ కేసును టూటౌన్‌ పోలీసులు చాకచక్యంగా 24 గంటల వ్యవధిలోనే ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు విజయనగరం ఇన్చార్జ్‌ డీఎస్పీ ఆర్‌.శ్రీనివాసరావు టూటౌన్‌ పోలీసు స్టేషన్‌ ఆవరణలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అలీజాన్‌ హత్యకేసు గురించి వివరించారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 15న పట్టణానికి చెందిన లక్ష్మణరావు అనే వ్యక్తి రింగురోడ్డులోని ఒక బార్‌కి వెళ్లి మద్యం తాగి, అక్కడ పనిచేసే సిబ్బందితో గొడవపడ్డాడు. బార్‌ మేనేజర్‌గా పనిచేస్తూ తోటపాలెంలో నివాసం ఉంటున్న జామి రంభవీధికి చెందిన గేదెల సన్యాసినాయుడు (ఎ4) వచ్చి లక్ష్మణరావును కర్రతో కొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని మెడికవర్‌ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. గాయపడిన లక్ష్మణరావును పరామర్శించేందుకు గెడ్డవీధికి చెందిన షేక్‌ అలీజాన్‌ (33) ఆస్పత్రికి వచ్చాడు. అదే సమయంలో లక్ష్మణరావును గాయపర్చిన విషయాన్ని గేదెల సన్యాసినాయుడు అతని స్నేహితుడైన బోయవీధికి చెందిన పొంతపల్లి సురేష్‌ (ఎ1)కు చెప్పి సహాయం కోరాడు. దీంతో సురేష్‌ అతని తమ్ముడు పొంతపల్లి శివ (ఎ3), రౌతువీధికి చెందిన పడాల సంతోష్‌ కుమార్‌ (ఎ2)లు ఆస్పత్రికి చేరుకున్నారు. లక్ష్మణరావును కొట్టిన విషయమై మాట్లాడేందుకుగాను షేక్‌ అలీజాన్‌ను తీసుకుని సురేష్‌, శివ, సంతోష్‌ కుమార్‌లు మోటార్‌ సైకిల్స్‌పై ధర్మపురి రోడ్డులో ఉన్న లేఅవుట్‌ వద్దకు వెళ్లి మద్యం తాగారు. ఆ సమయంలో వారి మధ్య తగాదా పెరగడంతో పొంతపల్లి సురేష్‌ మద్యం బాటిల్‌ పగులగొట్టి అలీజాన్‌ గొంతుపై కోయడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

తోటలో మృతదేహం దాచివేత

అనంతరం మృతదేహాన్ని మాయం చేయాలనే ఉద్దేశంతో బైక్‌పై ఎక్కించుకుని అర్ధరాత్రి దాటిన తర్వాత చిన్నాపురం లేఅవుట్‌ వద్దకు తీసుకువచ్చారు. అప్పటికే తెల్లవారడం, పశువుల కాపరులు రావడంతో ఓ తోటలో మృతదేహాన్ని దాచిపెట్టారు. హత్య జరిగిన ధర్మపురి లేఅవుట్‌కి వెళ్లి, అక్కడ హత్య జరిగిన ప్రాంతంలో ఆనవాళ్లు లేకుండా మట్టి, కారం జల్లారు. తరువాత సురేష్‌ వద్ద పనిచేసే తాపీ మేస్త్రీ ప్రసాద్‌కు సంబంధించిన కారులో వచ్చి తోటకు వచ్చి పెట్రోల్‌ పోసి మృతదేహాన్ని కాల్చే ప్రయత్నం చేసి నిందితులు పట్టుబడ్డారు. కేసులో ఇంకా దర్యాప్తు చేయాల్సి ఉందని, నిందితులను పోలీసు కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారణ చేస్తామని డీఎస్పీ తెలిపారు. సమావేశంలో టూటౌన్‌ సీఐ సీహెచ్‌.లక్ష్మణరావు, ఎస్సై షేక్‌ శంకర్‌, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల కొట్లాట

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై కత్తులతో టీడీపీ వర్గీయుల దాడి
- తీవ్రంగా గాయపడిన ముగ్గురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు
- స్వల్పంగా గాయపడిన టీడీపీ వర్గీయులు



కత్తిదాడిలో గాయపడిన సూర్యనారాయణ

వంగర: మండలంలోని మడ్డువలస గ్రామంలో బుధవారం జరిగిన కొట్లాటలో ఇరువర్గాలకు చెందిన 10 మందికి గాయాలయ్యాయి. ఈ మేరకు వంగర ఎస్సై బుడుమూరు లోకేశ్వరరావు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి. సీసీ రోడ్డుపై ఒకరి ఇంటి ముందర వేరొకరు చెత్తాచెదారాలు వేసుకుంటున్నారని, మూత్రవిసర్జన చేస్తున్నారన్న విషయం గొడవకు దారితీసింది. ఈ ఘటనలో టీడీపీ వర్గీయులు మన్నేన రమణ, మన్నేన సింహాచలం వైఎస్సార్‌సీపీ వర్గీయులపై కత్తులతో దాడికి పాల్పడ్డారు. దీంతో వైఎస్సార్‌సీపీకి చెందిన తివనాన సూర్యనారాయణ, బూరాడ గరికినాయుడు, బూరాడ విష్ణులకు తల, కాలు, వీపు భాగాలపై తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఘటనలో టీడీపీకి చెందిన మన్నేన రాములమ్మ, మన్నేన సన్యాసప్పడు, మన్నేన రమణ, మన్నే సింహాచలం, మన్నేన దినేష్‌, మన్నేన సుశీల, గండబోయిన ఆదిలక్ష్మిలకు స్వల్ప గాయాలయ్యాయి. ఇరువర్గాల వారు రాజాంలోని వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. వైఎస్సార్‌సీపీ వర్గానికి చెందిన బూరాడ గరికినాయుడు ఫిర్యాదుపై 12 మందిపై, టీడీపీ వర్గానికి చెందిన మన్నేన రాములమ్మ ఫిర్యాదుపై ఏడుగురిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లోకేశ్వరరావు తెలిపారు.

క్రైస్తవ మందిరాలపై దాడులు అరికట్టాలి

- జిల్లా పాస్టర్స్‌ ఫెలోషిప్‌ అధ్యక్షుడు డాక్టర్‌ విజయకుమార్‌ శర్మ

విజయనగరం టౌన్‌: క్రైస్తవ మందిరాలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించి మత సామరస్యాన్ని కాపాడాలని జిల్లా పాస్టర్స్‌ ఫెలోషిప్‌ అధ్యక్షుడు డాక్టర్‌ వి.విజయకుమార్‌ శర్మ పేర్కొన్నారు. పట్టణంలోని అయ్యన్నపేట పాస్టర్‌ ఎస్‌.జాన్‌ సత్యసువార్త ప్రార్థనా మందిరంలో బుధవారం జిల్లా పాస్టర్స్‌, సంఘ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పాస్టర్స్‌ ఫెలోషిప్‌ బలపడడానికి సంఘ ప్రతినిధులందరూ కృషిచేయాలని కోరారు. చర్చిలపై జరుగుతున్న దాడుల సంస్కృతి ప్రజాస్వామ్యంలో మంచిది కాదన్నారు. పాస్టర్‌ డాక్టర్‌ పి.ప్రేమానందం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బిషప్‌ ఎం.పాల్సన్‌, డాక్టర్‌ బి.ఉదయ్‌ చంద్ర, డాక్టర్‌ ఎం.ఐజాక్‌, రెవరెండ్‌ డి.ఎలీషా, ఏసురత్నం, జయప్రకాష్‌, ఎస్‌.మధు, రమేష్‌, శామ్యూల్‌పాల్‌, శ్రీధర్‌, మధుసూదన్‌, నికోడమస్‌ పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

తెర్లాం: మండలంలోని విజయరాంపురం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాము దగ్ధమైంది. గ్రామానికి చెందిన నాగళ్ల సూర్యనారాయణ పశువుల మేత కోసం కొనుగోలు చేసుకున్న గడ్డిని స్థానికంగా ఉన్న చెరువు గట్టుపై కుప్పగా పెట్టాడు. చెరువులో ఉన్న అగురుకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గట్టుపై ఉన్న గడ్డివాముకు నిప్పు అంటుకుంది. దీంతో గడ్డి కుప్పంతా పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.50వేలు విలువ చేసే గడ్డి పూర్తిగా కాలిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తంచేస్తున్నాడు.

తునివాడలో..

రేగిడి: మండలంలోని తునివాడ గ్రామంలో వంజరాపు అసిరినాయుడుకు చెందిన గడ్డివాము అగ్నికి ఆహుతైంది. ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. కళ్లంలో నూర్పిడిచేసి ఉంచి మూడెకరాలకు చెందిన గడ్డివాములు పూర్తిగా కాలిపోయాయి.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడి మృతి



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

భోగాపురం: విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. భోగాపురం జాతీయ రహదారి పక్కన ఉన్న నేతి విందు హోటల్‌ సమీపంలో గుర్తు తెలియని వృద్ధుడు ఎండకు తాళలేక వడదెబ్బ తగిలి మంగళవారం సొమ్మసిల్లి పడిపోయాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రుడిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. మృతుని వయసు 60 పైగా ఉంటుందని, తెల్లని షర్ట్‌, సిమెంట్‌ కలర్‌ ట్రాక్‌ ధరించి ఉన్నాడని ఎస్సై చెప్పారు.

గిరిజన రైతు ఇంట ఉ‘సిరి’



ఈతమానుగూడలో ఆరబెట్టిన ఎండు ఉసిరి

- ఎండు ఉసిరికి ధర పెంచిన జీసీసీ
- కిలో రూ.60 నుంచి రూ.80కి పెంపు
- గతేడాది కంటే రూ.20 పెరిగిన మద్దతు ధర
- ఎండు ఉసిరిని సిద్ధం చేయడంలో గిరిజనుల నిమగ్నం
- మన్యంలో సుమారు 6 వేల ఎకరాల్లో ఉసిరి తోటల సాగు

సీతంపేట: గిరిజన రైతుకు ఉసిరి పంట సిరులు కురిపిస్తోంది. ఎండు ఉసిరి ధరలను గిరిజన సహకార సంస్థ (జీసీసీ)పెంచింది. గతేడాది కిలో రూ.60కి కొనుగోలు చేసిన జీసీసీ ఈ ఏడా ది రూ.20 పెంచి రూ.80కి కొనుగోలు చేస్తోంది. జీసీసీ ధరలు పెంచడంతో మైదాన ప్రాంతా ల వ్యాపారులు సైతం ఇదే అదునుగా రెండు నుంచి ఐదు రూపాయల వరకు అదనంగా మద్దతు ధర పెంచి కొనుగోలు చేస్తున్నారు. అయితే, వ్యాపారులు తూకంలో మోసాలు చేస్తుండడంతో అధికమంది రైతులు జీసీసీకే విక్రయిస్తున్నారు.

పెట్టుబడిలేని పంట

కొండపోడులో తక్కువ పెట్టుబడితో ఉసిరి పంట గిరిజన రైతు చేతికి అందుతోంది. ఏజెన్సీలో సుమారు ఆరు వేల ఎకరాల్లో పంటను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం పచ్చి ఉసిరి కాయలు కావిడ ధర రూ.400ల నుంచి రూ.500ల వరకు సంతల్లో పలుకుతోందని, గతేడాది ఇదే సీజన్లో కావిడ ధర 7 వందలు ఉండేదని గిరిజనులు చెబుతున్నారు. పంటను ఎండబెట్టి మద్దతు ధరకు జీసీసీకి విక్రయిస్తున్నామని చెప్పారు. ఎండు ఉసిరి తయారు చేయాలంటే కనీసం నెలరోజుల సమయం పడుతుందని, పచ్చి ఉసిరి కాయలను చిదకగొట్టిన తర్వాత ఎండలో పక్షం రోజుల పాటు ఆరబెట్టాల్సి ఉంటుందన్నారు. ఆ సమయంలో వాతావరణం అనుకూ లిస్తే ఎండు ఉసిరి సిద్ధమవుతుందన్నారు.

ఎండు ఉసిరి కొనుగోలు చేస్తాం

నాణ్యతగల ఎండు ఉసిరి ధరలు పెంచాం. గతేడాది కంటే కిలోకు రూ.20లు పెంచాం. గిరిజనుల నుంచి ఎండు ఉసిరిని కొనుగోలు చేస్తున్నాం. ఎన్ని క్వింటాలైనా కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం.

– దాసరి కృష్ణ, జీసీసీ మేనేజర్‌

పంట బాగుంది

ఈ ఏడాది ఉసిరి పంట మంచి దిగుబడి వచ్చింది. పచ్చి ఉసిరిని సేకరించి ఎండు ఉసిరిగా ఈ రెండు నెలలకాలంలో తయారు చేస్తాం. వ్యాపారులకు, గిరిజ న సహకార సంస్థలకు విక్రయిస్తాం. మద్దతు ధర లభిస్తోంది.

– ఎస్‌.సురంగ, పొంద్ర

మామను హత్య చేసిన అల్లుడు

- అత్తకు గాయాలు
- నిందితుడి పరారీ

గంట్యాడ: భార్యను కాపురానికి పంపించడం లేదని ఆగ్రహించిన అల్లుడు అత్తమామలపై దాడి చేసి మామను హత్య చేశాడు. ఈ దాడిలో అత్తకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలంలోని తాటిపూడి గ్రామానికి తామాడ అప్పలస్వామి తన కుమార్తెను మేనల్లుడు పడాల సత్యనారాయణకు ఇచ్చి వివాహం జరిపించాడు. కొంతకాలంగా వారిద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో తరచూ గొడవపడుతున్నారు. భర్త వేధింపులు భరించలేక కొద్ది రోజుల క్రితం భార్య కన్నవారింటికి వచ్చేసింది. సత్యనారాయణ విశాఖపట్నం వెళ్లి కూలి పనులు చేసుకుంటున్నాడు. రెండు రోజుల క్రితం సత్యనారాయణ తాటిపూడి వచ్చాడు. మళ్లీ భార్యను తన ఇంటికి పంపించమని మామను మంగళవారం రాత్రి 9 గంటల సమయంలో అడగగా పంపించడానికి ససేమిరా అన్నాడు. దీంతో మామను అడ్డు తొలగిస్తే భార్య కాపురానికి వస్తుందని భావించి కత్తితో మామ అప్పలస్వామిపై దాడిచేశాడు. ఆ సమయంలో అడ్డుకున్న అత్త అప్పలకొండపై దాడికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అప్పలస్వామి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. గాయపడిన అప్పలకొండను ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో కుటుంబ సభ్యులు చేర్పించారు. అక్కడ చికిత్స తీసుకున్న ఆమె కోలుకోవడంతో వైద్యులు బుధవారం డిశ్చార్జ్‌ చేశారు. నిందితుడు సత్యనారాయణ పరారీలో ఉన్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్సై గణేష్‌ తెలిపారు.

అనుమతులు ఒకచోట.. తవ్వకాలు మరోచోట..!

- కుమిలి అటవీ భూముల్లో అక్రమమైనింగ్‌
- క్వారీయింగ్‌ నిలుపుదల చేస్తూ ఆదేశాలు

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి కొండ సర్వే నంబర్‌ 1లో అటవీభూముల్లో అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయి. గ్రావెల్‌ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతంలో ఫారెస్టు అధికారులు పరిశీలించి ఫారెస్టు భూమిలో కొంత మేర తవ్వకాలు జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. రెవెన్యూ, మైనింగ్‌ అధికారులకు సమాచారం ఇచ్చి క్వారీయింగ్‌ను నిలుపుదల చేయించి వాహనాన్ని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. కుమిలి కొండ సర్వే నంబర్‌ 1లో 428.70 ఎకరాల భూమి ఉంది. అందులో కొంత వరకు నిబంధనల మేరకు 2015లో టీడీపీ నేత కుమారుడి పేరిట మైనింగ్‌కు ఆదేశాలు ఇచ్చారు. తాజాగా ఫారెస్టు అధికారులు ఆ శాఖకు చెందిన భూముల్లో కొంత మేర అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించి మైనింగ్‌ నిలిపివేయించారు.

విచారణ చేసి నిర్ధారణ

దీనిపై పూసపాటిరేగ తహసీల్దార్‌ ఇ.భాస్కరరావు స్పందిస్తూ మైనింగ్‌ జరుగుతున్న భూములు అనుమతులు ఉన్న ప్రభుత్వభూములే అన్నారు. దీనిపై పూర్తిస్థాయిలో సర్వే చేసిన తరువాత మైనింగ్‌ అనుమతులు వున్నచోట జరిగిందా లేదా అటవీశాఖ భూముల్లో జరిగిందా అనేది నిర్ధారిస్తామన్నారు. ఫారెస్టు బీట్‌ అధికారి కృష్ణ మాట్లాడుతూ అటవీశాఖ భూములులో కొంతమేర తవ్వకాలు జరుగుతుండడంతో క్వారీయింగ్‌ నిలిపి వేయించామన్నారు.

కరోనా కలకలం

- ముగ్గురు విద్యార్థులకు కరోనా లక్షణాలు!
- రాపిడ్‌ టెస్ట్‌లో నిర్ధారణ
- శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించిన వైద్యసిబ్బంది
- పాఠశాలను సందర్శించిన పీఓ విష్ణుచరణ్‌



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఓ విష్ణుచరణ్‌

మక్కువ: కరోనా మళ్లీ అలజడి రేపుతోంది. మక్కువ మండలం ఎర్రసామంతవలసలోని ఏకలవ్య పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు కరోనా లక్షణాలతో బాధపడుతున్నట్టు వైద్యులు గుర్తించారు. పాఠశాలకు చెందిన కొంత మంది విద్యార్థులు మూడు రోజులుగా దగ్గుతో బాధపడుతున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్‌ బి.ఎర్రినాయుడు సమాచారం మేరకు శంబర పీహెచ్‌సీ వైద్యాధికారి రఘు తన సిబ్బందితో కలిసి పాఠశాలలో సోమ, మంగళవారాలు వైద్యపరీక్షలు చేశారు. సుమారు 20 మంది విద్యార్థులకు రాపిడ్‌ కిట్లతో కరోనా నిర్ధారణ పరీక్షలు చేశారు. వీరిలో ముగ్గురు విద్యార్థులకు పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో ప్రత్యేక తరగతి గదిలో ఉంచి వైద్యసేలు అందిస్తున్నారు. ప్రస్తుతం ముగ్గురు చిన్నారుల ఆరోగ్యం నిలకడగానే ఉందని, పూర్తిస్థాయిలో నిర్ధారణకు శాంపిల్స్‌ను శ్రీకాకుళంలోని ల్యాబ్‌కు పంపించినట్టు వైద్యాధికారి రఘు తెలిపారు. నివేదిక రావాల్సి ఉందన్నారు.

పాఠశాలలో శానిటైజేషన్‌..

కరోనా లక్షణాలు బయటపడడంతో పంచాయతీ కార్యదర్శి గణేష్‌ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణను శానిటైజేషన్‌ చేశారు. పాఠశాల ఆవరణంతా బ్లీచింగ్‌ చల్లించారు. పార్వతీపురం ఐటీడీఏ పీఓ సి.విష్ణుచరణ్‌ బుధవారం పాఠశాలకు చేరుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై వైద్యాధికారి రఘును, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వేగంగా కోలుకునేలా వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. తరగతి గదులు, డార్మిటరీ, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీర్‌ అధికారి జె.శాంతీశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పాఠశాల ఆవరణలో బ్లీచింగ్‌ జల్లుతున్న వైద్య, పంచాయతీ సిబ్బంది

నూతన వ్యాపార చట్టాలపై సదస్సు

- వ్యాపారానికి భద్రత మేధోసంపత్తి హక్కులు
- గిరిజన వర్సిటీ అసోసియేట్‌ ప్రొఫెసర్‌



మాట్లాడుతున్న గిరిజన విశ్వవిద్యాలయం అసోసియేట్‌ ప్రొఫెసర్‌

విజయనగరం అర్బన్‌: నూతన వ్యాపారాలు చేపట్టినప్పుడు వాటికి మేధో సంపత్తి భద్రత నిస్తుందని ఆ దిశగా కళాశాల స్థాయి నుంచే తయారు కావాలని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం బిజినెస్‌ మేనేజ్‌మెంట్‌ విభాగానికి చెందిన అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎల్‌.వి.అప్పసబ అన్నారు. స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్‌ కళాశాలలో ‘నూతన వ్యాపారానికి కావలసిన చట్టపరమైన, నైతిక అంశాలు’ అనే అంశాలపై బుధవారం జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త వ్యాపారాలకు దేశంలో ఎదురయ్యే సవాళ్లను వాటి పరిష్కారాల గురించి తెలియజేశారు. ముద్ర యోజన ద్వారా కొత్త వ్యాపారాలను ప్రారంభించవచ్చని, దానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని ఈ సందర్భంగా విద్యార్థులకు తెలియజేశారు. నైతిక అంశాలు వ్యాపారంపై చూపే ప్రభావాన్ని గురించి వివరించారు. నూతన వ్యాపారాలు ఆలోచనలను భారీ వ్యాపారాలుగా తీర్చిదిద్దిన తీరును ఫేస్‌బుక్‌, జొమాటో, స్విగ్గీ వంటి వ్యాపారాలను ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ డాక్టర్‌ మజ్జి శశిభూషణరావు, కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ డీవీరామమూర్తి, డిపార్ట్‌మెంట్‌ ఆఫ్‌ మేనేజ్‌మెంట్‌ స్టడీస్‌ హెచ్‌ఓడీ డాక్టర్‌ ఎస్‌.వరూధిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాల్తేర్‌ డివిజన్‌లో రైల్వే స్టేషన్‌ల అభివృద్ధే ధ్యేయం

- 16 అమృత్‌ భారత్‌ స్టేషన్ల ఎంపిక
- డీఆర్‌ఎం అనూప్‌ శత్పతి



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం అనూప్‌ శతపతి

పార్వతీపురంటౌన్‌: వాల్తేరు డివిజన్‌లో గల అన్ని రైల్వే స్టేషన్‌ల అభివృద్ధే ధ్యేయంగా రైల్వే అధికారులంతా కృషిచేస్తున్నారని వాల్తేరు డివిజనల్‌ మేనేజర్‌ అనూప్‌ శతపతి అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురం జిల్లా కేంద్రంలో గల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అమృత్‌ భారత్‌ రైల్వే పనులను పరిశీలించారు. రైల్వే నుంచి ప్రయాణికులకు అందుతున్న సేవలను, ఇంకా ఏమైనా సేవలు అందాలా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్తేరు డివిజన్‌లో అమృత్‌ భారత్‌ పథకంలో 16 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధికి రూ.250కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. వాటికి సంబంధించిన పనులు నాణ్యతా ప్రమాణాలతో శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌ ఆధునికీకరణ, అభివృద్ధిలో భాగంగా రూ.10కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. టికెట్‌ బుకింగ్‌ కౌంటర్‌, రిజర్వేషన్‌ కౌంటర్‌, అధునాతన సాంకేతికతతో కూడిన ఫ్లైఓవర్‌ నిర్మించేందుకు పనులు చేపట్టామని, వాటిని సాధ్యమైనంత త్వరలో ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ప్రయాణికులను సమయానికి గమ్యస్థానాలకు చేర్చేందుకు మూడవ రైల్వే లైన్‌ పనులను చేపట్టామని తెలియజేశారు. మూడవ లైన్‌ పనులు 50శాతం పూర్తయ్యాయని, సాధ్యమైనంత త్వరలో అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. పార్వతీపురం రైల్వే స్టేషన్‌ అభివృద్ధి శరవేగంగా జరుగుతుందని ప్లాట్‌ఫాంల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించారని సంతృప్తి వ్యక్తం చేశారు.

పూర్తిస్థాయిలో మౌలిక వసతులు

అమృత్‌ భారత్‌ పథకంలో భాగంగా నిర్మిస్తున్న నూతన రైల్వేస్టేషన్లలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు అందుబాటులోకి రానున్నాయని డీఆర్‌ఎం అనూప్‌ శతపతి తెలిపారు. ప్రతి స్టేషన్‌లో అధునాత టాయిలెట్లు, ఆర్‌ఓ డ్రింకింగ్‌ వాటర్‌, ప్రయాణికులు సేదదీరేందుకు విశ్రాంతి గదులు, ఏసీ వెయిటింగ్‌ హాల్స్‌, డార్మిటరీ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకువస్తున్నామన్నారు. ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు అందించేందుకు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

రోగులను పలుకరిస్తూ... సేవలపై ఆరా తీస్తూ..



రోగులతో మాట్లాడుతున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి బుధవారం స్థానిక ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. రోగులను ఆప్యాయంగా పలుకరించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. తొలుత రక్తపరీక్షల గదిని సందర్శించారు. ఓపీ విభాగంలో ఓపీ నమోదును పరిశీలించారు. ఎక్స్‌రే యూనిట్‌తో పాటు ఎస్‌ఎన్‌సీయూ, న్యూట్రీషియన్‌ రిహెబిలిటేషన్‌ కేంద్రం, ప్రసూతి కేంద్రాలను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న ప్రసవాల తీరును వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మందులన్నీ ఉండేలా చూసుకోవాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రి భవనాలను పరిశీలించి, నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి ప్రధాన వైద్యాధికారి బి.శ్రీనివాసరావు, ఆర్‌ఎంఓ గౌరిశంకర్‌, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.